## ఎఐటిఎస్ లో ఆన్ లైన్లో

# ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాజంపేట ఎఐటిఎస్ లో శనివారం ఎ.టి.ఎ.ఎల్ ఎ.ఐ.సి.టి.ఇ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఆర్థోపెడిక్ మరియు టిష్యూ ఇంజనీరింగ్ అప్లికేషన్ల కోసం అడ్వాన్స్డ్ బయోమెటీరియల్స్ ఈనెల 29వ తేదీ వరకు మెకానికల్ ఇంజనీరింగ్ అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు సైన్సెస్, రాజంపేటలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్డిపి) ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారతదేశం అంతటినుండి 123 మంది పాల్గొన్నారు. తిగితిలితిదిగిని స్పాన్సర్డ్ ప్రోగ్రామ్లో బయోమెటీరియల్స్, ఉపరితల ఇంజనీరింగ్, 3డీ ప్రింటింగ్, నానోటెక్నాలజీ, మరియు టిష్యూ ఇంజనీరింగ్ వంటి ఆధునిక అంశాలను విశ్లేషించారు. ప్రోగ్రామ్ లో పాల్గొన్న ఫ్యాకల్టీ సభ్యులు బయోమెటీరియల్స్ రూపకల్పన, సింథసిస్, ఉపరితల ప్రక్రియలు, మరియు 3డీ మోడలింగ్లో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. ఈ ఎఫ్డిపి ప్రత్యేకతలలో భాగంగా ఆర్థోపెడిక్ మరియు టిష్యూ ఇంజనీరింగ్ అప్లికేషన్లకు అవసరమైన ఇంప్లాంట్లు మరియు స్కాఫోల్డ్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అంతేకాకుండా, పరిశోధనలో ఉపయోగపడే ఆధునిక పరిజ్ఞానం, బయోటెక్నాలజీ, మరియు మెడికల్ ఇంజనీరింగ్ రంగాలలో నూతన మార్గాలను సూచించే పాఠాలు అందించబడ్డాయి. ఐ.ఐ. టి, అమెరికా, ఫ్రాన్స్, మరియు భారతదేశంలోని నిపుణుల లెక్చర్లు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య పాత్ర పోషించిన వారు న్యూఢిల్లీకి చెందిన ATAL-AICTE, ఏ ఐ టి కి చెందిన సెక్రటరీ డా. సి. గంగిరెడ్డి, చైర్మన్ డా. సి. రామచంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ సి. యల్లా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. అభిషేక్ రెడ్డితో పాటు, కన్వీనర్ డా. హెమంత కుమార్, కోఆర్డినేటర్ అజయ కుమార్ రెడ్డి, కో కోఆర్డినేటర్ వెంకటేష్, ప్రోగ్రామ్ విజయానికి కీలకంగా సహకరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఫ్యాకల్టీ సభ్యులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతోపాటు ఆర్థోపెడిక్ బయోమెటీరియల్స్ అభివృద్ధి కోసం వృత్తిపరమైన నైపుణ్యాలను సాధించగలిగారు.

### వైయస్సార్టియుసి కడప నగర అధ్యక్షుడు నంద్యాల నాగరాజు

కడప కార్పొరేషన్ జనవరి 25 ప్రభాతవార్త:



వైయస్ఆర్టియుసి కడప నగర అధ్యక్షుడిగా ఎ1అంబులెన్స్, నంద్యాల నాగరాజు నియమితులయ్యారు. శనివారం కడప వైకాపా కార్యాలయంలో కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డిని వైయస్ఆర్టియుసి అధ్యక్షుడు నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా బహికరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల కోసం పాటుపడతానని తెలిపారు.

## ఎన్డీఏ కూటమిలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు




కడప కార్పొరేషన్ జనవరి 25 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది మాసాలు గడుస్తున్నా అభివృద్ధి నోచుకోలేదని, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందడం లేదని వైసిపి కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. శనివారం కడప వైకాపా కార్యాలయంలో పాత్రికేయులతో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ మహిళలపై దురాగతాలు, పిల్లలపైన అత్యాచారాలు, గంజాయి, పేకాట, మట్కా, జూదం కోడిపందాలు, పెరిగిపోయాయని, యదేచ్ఛగా మట్టి, ఇసుక దోపిడీ కొనసాగుతుందని ఆరోపించారు. సొంత ఆస్తులు పెంచుకునే విధంగా పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. అప్పులు చేస్తున్నారని దుయ్య బట్టారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, అక్కడి కంపెనీలతో ఎంవోయిలు చేసుకోలేదన్నారు. కంపెనీలు ఏపీకి రాలేదని చెప్పారు. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు మాత్రం ఎంవోయూలు కుదుర్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైకాపా నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్, నాగేంద్ర రెడ్డి, నాగరాజు, త్యాగరాజు, సాయి దత్త, షఫీ, కరిముల్లా పాల్గొన్నారు.

### పీవీ రావు మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షునిగా జేష్టది భాస్కర్

ప్రొద్దుటూరు జనవరి 25 ప్రభాతవార్త :



పీవీ రావు మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షుడిగా ప్రొద్దుటూరుకు చెందిన జేష్టాది భాస్కర్ నియమితులయ్యారు. విజయవాడలోని మినర్వా గ్రాండ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆదేశాల మేరకు జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి చేతుల మీదుగా ఆయన ఈ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా అధ్యక్షుడు జేష్టది భాస్కర్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు చరిత్ర కలిగిన పివి రావు మాల మహానాడులో నన్ను నమ్మి కడప జిల్లా అధ్యక్షునిగా నన్ను జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య , జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచ నాగ మల్లీశ్వరి నన్ను ఎన్నుకున్నందుకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తరతరాలుగా దళిత వర్గాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కడప జిల్లా వ్యాప్తంగా పోరాటం చేసి జాతిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గూడం చెరువు సంపత్ కుమార్, శ్రీపతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ



చిన్నమండెం జనవరి 25 ప్రభాతవార్త:

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం చిన్నమండెం లోని పుర వీదులలో తహసిల్దార్ నరసింహులు ఆద్వర్యంలో పౌరులు ,విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఓటుకు ఉన్న విలువను వివరించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి. అనంతరం ప్రతిజ్ఞ చేయెంచారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పలు విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

## లారీ బోల్తా... తప్పిన ప్రమాదం

పులివెందుల, జనవరి 25, ప్రభాతవార్త :

లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. శనివారం తెల్లవారుజామున మండల పరిధిలోని ఎర్రిపల్లె దగ్గర ప్రకాశం జిల్లా గురజాల నుంచి సత్యసాయి జిల్లా మడకశిరకు వెళ్తున్న బియ్యం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాల్లోకెళ్తే పులివెందుల నుంచి వెళ్తున్న మోటార్ వెహికల్ అడ్డు రావడంతో తప్పించబోయి బోల్తా పడింది. లారీ లో 26 కెజి ల బియ్యం బస్తాలు 962 ఉన్నాయి. కరెంటు స్తంభం విరిగి లారీపై పడింది వైర్లు కింద పడకపోవడంతో అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది.

## ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

దువ్వూరు, జనవరి 25, ప్రభాతవార్త:

గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్లో మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం అన్నారు. మొదటి విడతలో మండలంలో సుమారు 600మంది నిరక్షరాస్యులను గుర్తించి వారికి విద్య నేర్పాలన్నారు. టీచర్లు ఉత్తమ పద్దతుల ద్వారా బోధన ఉంటుందన్నారు.

## టీకాలు సక్రమంగా వేయాలి

దువ్వూరు, జనవరి 25, ప్రభాతవార్త:

గర్భవతులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్ అన్నారు. శనివారం చింతకుంట, గుడిపాడు ఆరోగ్య సేవా కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన వారికి అన్ని రకాల టీకాలు వేస్తున్నారా లేదా అలాగే ఆరోగ్య పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 5కాన్పులు జరిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అలాగే చింతకుంట గ్రామ సచివాలయంలో డాక్టర్ వికసిత ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ను నిర్వహించారు. ప్రస్తుతం ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి సర్వే నిర్వహిస్తున్నారని 18సంవత్సరాలు పైబడిన వారందరూ తమ వైద్య నివేదికలను అందజేసి సర్వేకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ మల్లేష్, సురేష్, హేమలత, రాజగోపాల్, వియజకుమారిలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం

చాపాడు, జనవరి 25, ప్రభాతవార్త:

ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయుధం లాంటిదని ఓటు హక్కును విధిగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రమాకుమారి తెలిపారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సంధర్భంగా నాలుగు రోడ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 1950వ సంవత్సరం భారత ఎన్నికల సంఘం జనవరి 25తేది స్థాపించిన రోజు కావడంతో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను ఘణంగా జరుపుకుంటారన్నారు. ఎన్నికలలో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఇదే రోజున దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నందున ఓటింగ్ వైపు ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో చియ్యపాడు గ్రామానికి చెందిన మహానంది గారి సుబ్బిరెడ్డి అనే ఓటర్కు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఈ సర్వే డిటి నారాయణ స్వామి, ఆర్ఐ శంకర్ రెడ్డి, సీనియర్ సహాయకులు వెంకటేశ్వర్లు, వీఆర్వోలు ఇస్మాయిల్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## బీడు భూముల్లో మొక్కలు సాగు చేయాలి

పీలేరు జనవరి 25 ప్రభాతవార్త ః

పొలాలు గట్లు, బీడు భూముల్లో అడవులను పెంచే విధంగా రైతులకు సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతయినా ఉందని మాస్టర్ ట్రైనర్ విఆర్డియెస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి అన్నారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20నుంచి ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో ఆగ్రో ఫారెస్ట్ పై మాస్టర్ ట్రైనర్ లకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణ కార్యక్రమ అధికారి సతీష్ మాట్లాడుతు బీడు భూముల్లో మొక్కలు నాటి అడవులను అభివృద్ధి దిశగా కార్యాచరణ జరుగుతున్నదని అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల నుండి సుమారు 70మంది మాస్టర్ ట్రైనర్ లకు శిక్షణ ఇచ్చామని వారు గ్రామాల్లో ఒక్కొక్కరు సుమారు 100మంది రైతులకు సలహాలు ఇస్తారని తెలిపారు. విఆర్డియెస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు చెట్ల జాతులు, కార్బన్ క్రెడిట్స్ వంటి అంశాలపై శాస్త్రవేత్తలు నుంచి మంచి సూచనలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సిబ్బంది సతీష్, ప్రవీణ్, కిరణ్, అనూష వివిధ ఎన్జిఓలు, విహెచ్ఓలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## విధ్యార్థి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

వేంపల్లి, జనవరి 25, ప్రభాతవార్త :

కళాశాలకు వెళ్తున్నాని ఇంటి నుంచి వెళ్లిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి తిరిగి రాకపోవడంతో విద్యార్థి అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే వేంపల్లె పట్టణం, శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి శ్రీధర్(15) ఈనెల 18న ఉదయం 8 గంటల ప్రాంతంలో చక్రాయపేట లోని కళాశాలకు వెళ్తున్నాని చెప్పి ఇంటి వద్ద నుంచి వెళ్లాడు. అయితే ఆ అబ్బాయి కళాశాలకు రాలేదని కళాశాల సిబ్బంది తెలిపారు. ఆ అబ్బాయి ఆచూకీ కోసం చూట్టు ప్రక్కల బంధువుల ఇళ్లలో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభించక పోవడంతో శనివారం విధ్యార్థి అమ్మమ్మ రామసుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రంగరావు వివరాలు వెల్లడించారు. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి.

కలకడ జనవరి 25 ప్రభాతవార్త ః

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడిఏ కృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 20వ తేదీ నుండి జరుగుతున్న పశువైద్య శిబిరాలలో రైతులు తమ తమ పశువులను శిబిరాల వద్దకు తీసుకువచ్చి వైద్య సేవలు పొందాలని వారు సూచించారు. నట్టాల ఏ పశువైద్య శిబిరాలు ఈ నెల 31 వరకు నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. నివారణ బోటెక్స్ స్ప్రే డిటెక్టింగ్ ఇంజక్షన్లు వేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. శనివారం బొజ్జ గుంటపల్లి, రాతి గుంటపల్లి, ఎర్రకోటపల్లి పంచాయతీలలో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో పాపి రెడ్డి గారి పల్లి, నడిమి చర్ల పశు వైద్యాధికారులు తేజ కళ్యాణ్, పూర్ణిమ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతిలో పడ్డ గోమాత



సిద్దవటం, జనవరి 25, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్దవటం గాంధీవీధిలో నివాసం ఉన్న కాటయ్య(50) గోమాత శుక్రవారం కనిపించకపోవడంతో అతను చుట్టుపక్కల ప్రాంతాలలో విచారించినా ఆచూకీ లభించలేదు. గ్రామంలోని ఆకులవీధి రైతుల పంట పొలాల్లో ప్రమాదవశాత్తు శుక్రవారం రాత్రి నూతిలో పడిపోయిన విషయం అతనికి తెలియపరచగా గ్రామస్థుల సహకారంతో వెలికి తీయడానికి ప్రయత్నించినా ఫలించలేదు. స్థానికులు పోలీసులకు, ఇన్ఛార్జి మండల తహసీల్దారుకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన అధికారులు ఆ ప్రాంతానికి శనివారం ఉద యం చేరుకొని యంత్రం సహాయంతో నూతిలో పడ్డ గోమాతను వెలికి తీశారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సుబ్బరామచంద్ర, వీఆర్వో కేశవులు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

### యురేనియం ప్లాంట్ ను సందర్శించిన జేఎన్టీయూ విద్యార్థులు

పులివెందుల రూరల్, జనవరి 25, ప్రభాతవార్త :

వేముల మండలం లోని ఎం.తుమ్మలపల్లి యురేనియం ప్లాంట్ ను పులివెందుల జేఎన్టీయూ ఈసిఈ విద్యార్థులు సందర్శించారు. 70వ డిపార్ట్మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్ కింద యూసిఐఎల్ తుమ్మలపల్లె యూనిట్ ను విద్యార్థులు సందర్శించారు. ఇప్పటి వరకు 550 మంది విద్యార్థులు అత్యంత అధునాతన మైనింగ్, ఖనిజ ధాతువు ప్రాసెసింగ్ పద్ధతులను చూశారు. 70 సంవత్సరాల స్థాపనలో డీఏఈ, యూసిఐఎల్ అనేక కార్యక్రమాల గురించి సమాచారాన్ని అందించడం ద్వారా ప్రోగ్రామ్ యొక్క యాంకరింగ్ విపిన్ కుమార్ శర్మ, అంజాద్ అలీ ద్వారా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎం సుమన్ సర్కార్, డీజీఎం కిషోర్ భగత్ లు అణుశక్తి ప్రయోజనాలు, సురక్షిత శక్తి ఉత్పత్తి వైపు విద్యార్థులను ప్రేరేపించారు. యూసిఐఎల్ అన్ని యూనిట్లు, మైనింగ్ ముఖ్య అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించారు. పులివెందులలోని జేఎన్టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులకు డీఏఈ మెమెంటో, సమాచార బ్రోచర్లను పంపిణీ చేశారు. కె. లక్ష్మీ రంగయ్య, చీఫ్ సప్డిట్. (ఇన్స్టుమెంటేషన్) రోజువారీ కార్యకలాపాలు, మైనింగ్ మరియు ధాతువు ప్రాసెసింగ్లో ఎలక్ట్రానిక్స్ యొక్క అనేక అంశాల గురించి విద్యార్థులకు తెలిపారు. యురేనియం ధాతువు తవ్వకం, మిల్లులో అనేక పరికరాలు, యంత్రాల సహాయంతో తదుపరి ప్రాసెసింగ్ గురించి ప్రాథమిక వివరాలను తెలుసుకున్నందుకు విద్యార్థులు చాలా సంతోషించారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమం మరియు వర్క్ షాప్ ఏర్పాట్లలో సహకరించినందుకు మేనేజ్మెంట్కు ప్రొఫెసర్ కె.శివ చంద్ర, ప్రొఫెసర్ బి.వి.సౌజన్య కృతజ్ఞతలు తెలిపారు.

## దేశ భవిష్యత్తు యువతతోనే సాధ్యం




కలికిరి, జనవరి 25, ప్రభాతవార్త:

దేశ భవిష్యత్తు యువతతోనే సాధ్యమవుతుందని కలికిరి మండలం తహసీల్దార్ మహేశ్వరీభాయ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీని ప్రారంభించి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై కలిగే ప్రయోజనాలు యువతకు, ప్రజలకు అవగాహన కల్పించారు. యువత 18 సంవత్సరాలు నిండగానే ఓటు హక్కు పొంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం



జమ్మలమడుగు, జనవరి 25, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఏపీ మరియు జిల్లా కలెక్టర్, ఆదేశాల మేరకు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని శనివారం మండలంలోని ఎనియోజకవర్గ, బూతుస్థాయి జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం జరపడంలో భాగంగా ర్యాలీ, మానవ హారం సమావేశం నందు బూతు స్థాయి అధికారులు అవవార్డులు అందజేయడం జరిగింది. అలాగే అత్యధిక సార్లు ఓటు వేసిన సీనియర్ సిటిజన్లను సన్మానించడం యంగ్ ఓటర్లకు ఓటరు కార్డులు అందజేయడం జరిగి ఓటర్ల ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిశ్రీ, ఎన్నికల నమోదు అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, జమ్మలమడుగు, శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ వివేకానందరెడ్డి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సతీష్ జమ్మలమడుగు రెవెన్యూ ఇన్స్పెక్టర్ మండల స్థాయి అధికారులు వారి సిబ్బంది స్కూల్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

సిద్దవటం, జనవరి 25, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్దవటం స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం సీఐ టి.బాబు మాట్లాడుతూ ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన ప్రభుత్వ నిరుపేదల స్థలాలు భూ కబ్జాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ జీవీ అశోక్కుమార్ సూచన మేరకు ఓపెన్ డ్రింక్, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు గ్రామాల్లో ఘర్షణ వాతావరణం అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి మండల ఎస్సై శివప్రసాద్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కోతకు గురైన భూములను పరిశీలించిన ఏఈ

సిద్దవటం, జనవరి 25, ప్రభాతవార్త:

పెన్నా పరివాహ ప్రాంతాలలో వరద బీభత్సం వల్ల రైతులు భూములు కోతకు గురైన ప్రాంతాల్లో ఇరిగేషన్ శాఖ ఏఈ సాయికృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి గత ఏడాది డిసెంబరు 31న స్పందనలో ఫిర్యాదు చేయడంతో మాపై ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలించామని పెన్నానదిలో నీరు ఎక్కువగా ప్రవహిస్తూ ఉందని తగ్గిన వెంటనే మరోసారి వరదల వల్ల కోతకు గురైన పంట పొలాలు సర్వే నిర్వహించి నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఓటు ప్రతి పౌరుడి హక్కు




సిద్దవటం, జనవరి 25, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూలు నుంచి విద్యార్థినీ విద్యార్థులతో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం బస్టాండు కూడలి నుంచి పోలీసు లైన్, బ్రాహ్మణవీధి, దిగువపేట, పలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జి మండల తహసీల్దార్ మాధవీలత మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సిబ్బంది టీంలుగా ఏర్పాటు చేసి పోలింగ్ బూతులు వద్ద 80 సంవత్సరాలు పైబడిన వయో ఓటరు వృద్దులకు ఘనంగా సత్కరించామని ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు అని గత ఏడాది నవంబరు నెలలో ఓటు నమోదు కార్యక్రమం విజయవంతంగా జరిగిందని ఇంకా ఎవరైనా ఓటు హక్కు లేని పౌరుడు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్బాబు, ఇన్ఛార్జి హెడ్మాస్టర్ శ్రీహరి, ఉపాధ్యాయులు, వీఆర్ఏలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

పులివెందుల రూరల్, జనవరి 25, ప్రభాతవార్త :

దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని బిజెపి ఎస్సీ మోర్చ కడప జిల్లా అధ్యక్షులు కోడుమూర్తి శ్రీరాములు అన్నారు. సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పులివెందుల మండలం యర్రబల్లి హరిజనవాడ 130 పోలింగ్ బూత్ నందు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు కోడుమూర్తి శ్రీరాములు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను పలు సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ అవమానించింది అన్నారు. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుకూలంగా దళితుల కోసం ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోడీ అనేక పథకాలు ప్రవేశపెట్టారని ఆయన కొనియాడారు .డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులను అర్పించారు. ఈ కార్యక్రమంలో యర్రబల్లి హరిజనవాడ ప్రజలు పాల్గొన్నారు.

## ఓటు వేయడం పౌరుల హక్కే కాదు.. బాధ్యత కూడా...

కెవిపల్లి జనవరి 25 ప్రభాతవార్త ః




నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఓటు వేయడమన్నది పౌరుల హక్కు ఒకటే కాదని బాధ్యత కూడా అని ఏఆర్ఓ రమా, తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీతో పాటు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటుహక్కే కీలకమని అన్నారు. పౌరులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, పారదర్శకంగా వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీలు కూడా సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞను ర్యాలీలో పాల్గొన్న వారితో చేయించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారులు రెడ్డప్ప రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఏఎస్ఓ రామ్మోహన్, టిడిపి నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవం

వీరబల్లి, జనవరి 25, ప్రభాతవార్త:

మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అధ్యాపకులు ప్లె కార్డులు చేతబట్టి వీరబల్లి బస్టాండ్ వరకు నినాదాలు చేసుకుంటూ వెళ్లి మానవహారం చేయడం జరిగింది, ఈ సందర్భంగా వీరబల్లి మండల తాసిల్దార్ శ్రావణి మాట్లాడుతూ ఓటు చాలా విలువైందని 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు వజ్రాయుధం లాంటిదని, అలాంటి ఓటును ఉపయోగించి సమాజానికి మంచి చేకూర్చి వ్యక్తిని ఎన్నుకోవాలని ఓటును నోటుకు, మద్యపానానికి అమ్ముడు పోకూడదని విద్యార్థులు అవగాహన తెచ్చుకుని పల్లె ప్రాంతాలలో ఓటుకు ఉండేటటువంటి విలువను శక్తిని తెలియజేయాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా, అధ్యాపకులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, అరుణమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఓటర్ల దినోత్సవం



రైల్వే కోడూరు జనవరి 25 ప్రభాత వార్త:

పట్టణంలోని తాసిల్దార్ మెహబూబ్ చాంద్ ఆధ్వర్యంలో ఘనంగా ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తాసిల్దార్ కార్యాలయం నుండి టోల్గేట్ ప్రధాన రహదారి వద్ద మానవహారాన్ని ఏర్పాటు చేసి ఎస్వి జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓటర్ల దినోత్సవం పై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం ద్వారా సీనియర్ సిటిజెన్లను సన్మానించడం, ఓటర్లను అమ్ముకోవడం ఓటర్లు దగా చేయడం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్లకు అధిక ప్రాధాన్యత



రైల్వే కోడూరు జనవరి 25 ప్రభాత వార్త:

నియోజకవర్గంలోని అన్ని మారుమూల ప్రాంతాలలో సిమెంట్ రోడ్లకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అన్నారు. శనివారం పట్టణంలోని జగదంపల్లె ప్రాంతంలో పది లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లకు ప్రభుత్వ విప్ ఆరవ శ్రీధర్ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ అవసరమన్న ప్రతి చోట సిమెంట్ రోడ్లకు అధిక ప్రాధాన్యతను కల్పి స్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాలలో సిమెంట్ రోడ్లను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, మైనార్టీ నాయకురాలు సయ్యద్ మెహతా బేగం, పంచాయతీ రాజ్ డిఈ బాల నరసింహులు, పి సి ఎన్ బ్రదర్స్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




గాలివీడు, జనవరి 25(ప్రభాతవార్త):

మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలు తహసీల్దార్ భాగ్యలతో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నుండి సిబ్బందితో కలసి ప్లకార్డ్స్ ను చేత పట్టుకుని, ఓటుహక్కు గురించి నినాదాలు చేస్తూ ఊరేగింపుగా బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతి ఓటరు తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును నిజాయితీగా వేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు విలువ గురించి తెలుసుకుని ఎన్నికలలో ఓటును డబ్బుకు అమ్ముకోకుండా, సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్ఓలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులు సహకరించాలి




కలికిరి, జనవరి 25, ప్రభాతవార్త:

మండలం అభివృద్ధికి మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతి నిధులు అధికారులకు సహకరించాలని ఎంపీడీవో భానుమూర్తిరావు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండా ప్రకారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి గిరిధర్రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరంలో కలికిరి మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం 25 మినీ గోకులం షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్ మహేశ్వరీభాయ్ మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో 440 అర్జీలు రెవెన్యూ సమస్యలపై రైతులు, ప్రజల నుంచి రావడం జరిగిందన్నారు. వాటిలో ఇప్పటికే 174 అర్జీలు పరిష్కరించడం జరిగిందన్నారు. గుట్టపాలెం పంచాయతీ సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీలలో ట్యాంకుల ద్వారా మంచినీరు సరఫరా చేశామని వాటికి బిల్లులు రాలేదని తెలిపారు. మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో పింఛను పొందుతూ భర్తలు మృతి చెందితే వెంటనే భార్యలకు పింఛను మార్పే దిశగా గత ఏడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేంద్రబాబు, ఏపీవో సుజాత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు అరుంధతీ, సత్తాజ్, మేడికుర్తి వైద్యాధికారి చిన్నరెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్భయంగా ఓటు వేసినప్పుడే ప్రజాస్వామ్యానికి రక్షణ




**రాజంపేట అర్బన్, జనవరి 25 ప్రభాతవార్త**

ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేసినప్పుడే ప్రజాస్వామ్యానికి రక్ష ణలభిస్తుందని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం అని అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం పచ్చ జెండా ఊపి ఆమె ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్ఎస్ రోడ్, పాత బస్టాండ్ వరకు సాగింది. పాత బస్టాండ్ లో మనోహరంగా ఏర్పడారు. విద్యార్థులు ఓటర్ దినోత్సవ ప్రాముఖ్యతను పేర్కొంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ర్యాలీలో పాల్గొన్న అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సిటిజెన్లతో పాటు యువతను ఆమె సన్మానించారు. విశ్రాంత డిప్యూటీ తాసిల్దార్ ఓ. రామచంద్రయ్యతో పాటు ముగ్గురు యువకులను కూడా సన్మానించారు. ఉత్తమ బిఎల్ఓ లను కూడా సన్మానించారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ఆర్. కీర్తన ఎం. మహేష్, ఎస్.కే. నాజియా లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట తాసిల్దార్ పీర్ మున్ని, సీనియర్ అసిస్టెంట్ కుమార్ స్వామి, మున్సిపల్ ఆర్ఐ హరి, పలువురు బిఎల్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ




**లక్కిరెడ్డిపల్లి : జనవరి 25 ప్రభాతవార్త**

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండలం లోని అన్ని శాఖల అధికారులు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల నుండి స్థానిక మూడు రోడ్ల కూడలి వరకు కళాశాల విద్యార్థులతో మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహిస్తూ, ఓటర్లను చైతన్య పరుస్తూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకొని భారతీయ పౌరులుగా ఓటు హక్కును పొంది భారత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి భారతీయులు జన్మ హక్కు అని కావున ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మండల తహసిల్దార్ శ్రీనివాసులు , ఎంపిడివో రెడ్డెన్న తెలిపారు. అనంతరం మండల స్థాయి అధికారులు ఓటర్లకి ప్రశంస పత్రాలు అందజేసి ఓటు హక్కు వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ అందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ రెడ్డెన్న, ఎస్.ఐ.రవీంద్రబాబు, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి , ఏ.ఎస్.ఐ. మస్తానయ్య, డిప్యూటీ తహసిల్దార్ హరి, ప్రసాద్, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు, తో పాటు విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.



కడప జిల్లా నూతన SP గా బాధ్యతలు స్వీకరించిన నిబి అశోక్ కుమార్ IPS ని మర్యాద పూర్వకంగా కలిసిన నారాయణ విద్యా సంస్థల DGM రామమోహన్‌రెడ్డి.

## ఘనంగా ఓటర్ల దినోత్సవం



**రాజుపాళెం,జనవరి25,ప్రభాతవార్త.**

ఎన్నికల కమాషన్ ఎర్పడిన రోజును ఓటర్ల దినంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో శనివారం ఓటర్ల దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఎక్కువసార్లు ఓటహక్కును వినియోగించుకొన్న వృద్దులను సన్మానం చేయటం జరిగినది, కొత్తగా ఓటు హక్కును పొందిన వారికి ఓటరు కార్డును, వినియోగపత్రంను అందించారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు, రాగద్వేషాలకు అతీతంగా ప్రతిఫలం ఆశించకుండా ప్రజాస్వామ్య బద్ధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు, బియల్ఓలు సచివాలయ అధికారులు పాల్గోన్నారు.

## ఓటు హక్కే కీలకం




**రాయచోటి, జనవరి 25 ప్రభాతవార్త**

ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటు హక్కే కీలకమని, ఓటు వేయడం పౌరుల హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం, జనవరి 25వ తేదీన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాయచోటి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి కలెక్టర్ బంగ్లా వరకు జరిగిన ఓటర్ల దినోత్సవ ర్యాలీలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. 1950 జనవరి 25న భారత దేశ ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన తేదీని జాతీయ ఓటర్ల దినోత్సవం గా జరుపుకుంటున్నామని, ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా నిలిచే పౌరులందరి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ సంవత్సరం "ఓటు హక్కుకు సమానమైనది ఏదీ లేదు నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అనే థీమ్తో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పౌరులతో భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం




**మదనపల్లె, జనవరి 25 ప్రభాతవార్త :**

అర్హత గల ఓటర్లందరూ ఓటుహక్కును వినియోగించు కొన్నపుడే నిజమైన పండగని, ప్రజలను చైతన్య పరచడమే ఓటర్ల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ ఖాజాబీలు తెలిపారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, కమీషనర్ ప్రమీళలు ముఖ్య అతిథులుగాపాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి 25న ఎన్నికల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ ఓటరు నమోదు ప్రక్రియను 18సంవత్సరాలు నిండిన ప్రతి ఓటుహక్కును నమోదుచేసుకోవాలన్నారు. ఓటారు ఆధార్ అనుసందానంతో బోగస్ ఓట్లు తొలిగిపోతాయన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, సర్వేయర్. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మిట్స్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ

**కురబలకోట, జనవరి 25 ప్రభాతవార్త :**




కురబలకోట అంగళ్ళు వద్ద ఉన్న మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం అంగళ్ళు లో ఘనంగా నిర్వహించారు. ఈ ఓటర్ల దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ అధ్యక్షతన జరిగింది. ఓటర్ల దినోత్సవం సందర్భంగా కురబలకోట తహశీల్దార్ తపస్విని మాట్లాడుతూ పట్టణ ప్రజలకు, విద్యార్థులకు ఓటుహక్కుపై నమోదుగురించి వివరించారు.ఒకప్పుడు ఓటుహక్కు సంపన్నులకే ఉండేదని అయితే ఇప్పుడు 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ పొందవచ్చునన్నారు. ఓటుహక్కు పొందడానికి వార్డు సచివాలయాల్లో అప్లై చేసుకొని హక్కును పొందవచ్చునన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ పవిత్రమైన ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు రాజ్యాంగం ప్రసాదించే పవిత్రమైన హక్కు అన్నారు. అనంతరం విద్యార్థులచే, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపనకేతర బృందం పాల్గొన్నారు.

## కమలాపురం తాసిల్దారుకు రాష్ట్ర స్థాయి అవార్డు




**కమలాపురం జనవరి 25 ప్రభాతవార్త.**

కమలాపురం తాసిల్దారుగా పనిచేస్తున్న శివరామిరెడ్డికి రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్ట్రోల్ స్టాండింగ్ 2024 అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు కమిషనర్ దయాకర్ చేతుల మీదుగా అందుకున్నారు. వైఎస్ఆర్ జిల్లా ఆయన వైఎస్ఆర్ జిల్లా కమలాపురం తాసిల్దారుగా పనిచేస్తున్నారు. స్టాండింగ్ పరిమితి డివిజనల్ ఏ ఈ ఆర్ వోగా పనిచేసినందుకు ఈ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా ఆయనతోపాటు ఇద్దరు బిఎల్ఓలకు అవార్డు వచ్చింది ఈ సందర్భంగా తాసిల్దార్ శివరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అవార్డు రావడానికి సహకరించిన జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## ముగిసిన పుష్య మాస పూజా కార్యక్రమాలు




**గోపవరం, జనవరి 25, ప్రభాత వార్త**

మండలంలోని వల్లేరవారిపల్లె గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నందు పుష్య మాసం ఆరంభంతో నాల్గవ చివరి శనివారం సందర్భంగా స్వామి వారికి పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. స్వామి అలంకారం చూసిన భక్తులు మాట్లాడుతూ స్వామి అమ్మవారిని చూసేందుకు రెండు కళ్ళు సరిపోవడం లేదు అని, అంత చూడ చక్కగా ఉనారన్నారు. తదుపరి ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ మాఘ మాసం ప్రారంభంతో ప్రతి శనివారం మాఘమాసం పూర్తి అయ్యేంతవరకు స్వామి వారికి పలు రకాల గంగా జలాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు ఉంటాయి అని తెలిపారు, ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొనటం వలన పూర్వజన్మ పాప కర్మలు,పితృ శాప విమోచన,గండ దోషాలు పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులు తొలగిపోతాయని అందులోను లక్ష్మీనరసింహస్వామి శక్తివంతులు, ఉగ్రరూపం దాల్చి తదుపరి శాంతి మూర్తిగా అవతరించిన స్వామి వారు కనుక అభిషేకంలో పాల్గొన్న చూసిన ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి పలువురు వేద పండితులు తెలిపారు. తదుపరి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించి,అన్నదాన కార్యక్రమం బద్వేల్ పట్టణముకు చెందిన కీ"శే" ఆరవ. శ్రీనివాసులు ధర్మపత్ని నాగరత్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ఓటర్ల దినోత్సవం

**మదనపల్లె, జనవరి 25 ప్రభాతవార్త :**



పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఓటర్ల దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలక్రిష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఓటుహక్కు సంపన్నులకే ఉండేదని అయితే ఇప్పుడు 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ పొందవచ్చునన్నారు. ఓటుహక్కు పొందడానికి వార్డు సచివాలయాల్లో అప్లై చేసుకొని హక్కును పొందవచ్చునన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు సాయిశంకర్‌రెడ్డి ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ పవిత్రమైన ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు రాజ్యాంగం ప్రసాదించే పవిత్రమైన హక్కు అన్నారు. అనంతరం విద్యార్థులచే, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలచే ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపనకేతర బృందం పాల్గొన్నారు.

## మాంసం దుకాణాలు బంద్



**మదనపల్లె, జనవరి 25 ప్రభాతవార్త :**

పట్టణంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మాంసం దుకాణాలను మూసివేయాలని మున్సిపల్ కమీషనర్ ప్రమీల ఆదేశించారు. శనివారం రాత్రినుండే జంతువులను వధించడం ఆపివేయాలన్నారు. చికెన్, మటన్ సెంటర్లు, చేపల మార్కెట్లు మూసివేయాలని ఆదేశించారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకొంటామని కమీషనర్ తెలిపారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




**నిమ్మనపల్లె, జనవరి 25 ప్రభాతవార్త :**

మండలంలోని శనివారం ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం తహశీల్దార్ దనంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో బస్టాండు ప్రాంతం వరకు నిర్వహించారు. బస్టాండు ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి మండల అధికారులు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామి, ఏపిఎం మురళి,ఏపిఓ రమేష్, ఆర్ఐ రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొనగా స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

## చికాగోలో ఇంటర్నేషనల్ అవార్డు



**బద్వేలు అర్బన్, జనవరి 25 ప్రభాతవార్త**

మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి కుమారుడు వాకమల్ల సాయి సింహా రెడ్డి 2025 సొసైటీ ఫర్ ట్రాపికల్ వెటర్నరీ మెడిసిన్ స్టూడెంట్ అవార్డ్ (ఓరల్ ప్రెజెంటేషన్) లో మొదటి స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా కమిషనర్ వివరాలు తెలియజేస్తూ అమెరికాలోని చికాగో నందు యూనివర్సిటీ ఆఫ్ ఎలియన్స్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ మెడిసిన్ విభాగంలో సాయి సింహారెడ్డి స్టూడెంట్ అవార్డు పొందారన్నారు.

## జాతీయస్థాయి ప్రదర్శనకు కలకడ ఆదర్శ పాఠశాల

**కలకడ జనవరి 25 ప్రభాతవార్త :**

జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు కలకల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మలంగ్ షా వలి పేర్కొన్నారు. పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన లో వివిధ రాష్ట్రాల నుంచి ప్రదర్శనలు ప్రదర్శించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుండి కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన బయో ఇంజిన్ అండ్ బయో కెమికల్ క్లీనర్స్ అనే విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను సుమతి కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో విద్యార్థులు బిఎండి సుహేల్ మరియు ఎస్ఎండి రేహాన్ లు ప్రదర్శించారు . దక్షిణ భారతదేశ న్యాయ నిర్ణేతలు కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపిక చేయడం జరిగింది త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ఈ ప్రాజెక్టు ప్రదర్శింప బడుతుంది ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు ప్రిన్సిపల్ కె మలాంషావలి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను మరియు ఉపాధ్యాయురాలు సుమతీని అభినందించారు.



# ఉపాధి భళా!.. గ్రామాలకు ప్రగతి కళ



**అన్నమయ్య జిల్లాలో రూ.129 కోట్లతో గోకులాలు, ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం, సిసి రోడ్ల నిర్మాణం**
**గ్రామాలలో సుస్థిర ఆస్తుల కల్పనకు విస్తృతంగా పనుల మంజూరు**
**ఉపాధి హామీ ద్వారా మొత్తం చేపట్టిన పనులు 18,191, పూర్తి అయినవి 4,579, ప్రగతిలో 13612 పనులు**
**రైతుల జీవన ప్రమాణాలు మరియు నికర ఆదాయ మార్గాల పెంపుదల కార్యక్రమాల అమలు**
**ప్రతి కుటుంబానికి వందశాతం మేలు చేకూరేలా చూడడమే ప్రభుత్వ లక్ష్యం**

పల్లె సీమల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనతో కూటమి సర్కార్ పల్లె పండుగ పేరుతో రాష్ట్రంలో నూతన కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల అభివృద్ధికి ఒక కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 ఆగస్టు 23న అన్నమయ్య జిల్లాలోని 501 పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి పల్లె సీమలలో గోకులాలు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, ఫారం పాండ్లు, సిసి రోడ్ల నిర్మాణాల పనులు చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉపాధి హామీ పథకం ద్వారా అన్నమయ్య జిల్లాలో రూ.129 కోట్లతో గోకులాలు, ఫారం పాండ్లు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శరవేగంగా పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు గ్రామాలలో సుస్థిర ఆస్తుల కల్పన నిమిత్తం విస్తృతంగా పనుల అమలుకు జిల్లా యంత్రాంగాన్ని వేగవంతం చేశారు. డ్వామా మరియు పంచాయతీరాజ్ శాఖలను సమన్వయపరిచి గ్రామీణ ప్రాంతంలో రైతుల జీవన ప్రమాణాలు మరియు నికర ఆదాయ మార్గాల పెంపుదల కార్యక్రమాల అమలును ముమ్మరం చేశారు. గత ఐదు సంవత్సరాలలో గ్రామీణ ప్రాంతంలో నిర్వీర్యమైన గోకులాలు, ఫారం పాండ్లు, పండ్ల తోటల పెంపకం, సీసీ రోడ్ల నిర్మాణం పనులు కూటమి ప్రభుత్వం చేపట్టడంతో గ్రామీణ ప్రాంతంలో రైతులు, ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

### గోకులం నిర్మాణంలో మూడో స్థానంలో జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో పాడి రైతుల ప్రయోజనార్థం గోకులం పథకం పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు తమ స్థలం అనుకూలతను బట్టి గోకులం నిర్మాణానికి రెండు పశువులు ఉన్నవారికి యూనిట్ ధర రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు కలిగిన వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులు కలిగిన వారికి రూ.2.30 లక్షలు ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరు చేశారు. ఇందులో కేవలం రైతులు 10 శాతం భరించగా, మిగిలిన 90 శాతం ఉపాధి నిధుల నుంచి మంజూరు చేశారు. అదేవిధంగా 20 గొర్రెలు/మేకలకు షెడ్లు వేసుకునే వారికి యూనిట్ ధర రూ.1.30 లక్షలు, 50 గొర్రెలు/మేకలు కలిగిన వారికి రూ.2.30లక్షలు, అలాగే కోళ్ల ఫారాలకు 100 కోళ్లు పెట్టుకున్న వారికి షెడ్డు నిర్మాణానికి ఒక యూనిట్ కు రూ.87 వేలు, 200 కోళ్లు ఉన్న వారికి రూ.1.32 లక్షలు మంజూరు చేశారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం దారులకు 70 శాతం రాయితీతో ఉపాధి మెటీరియల్ నిధులను మంజూరు చేశారు. జిల్లాలో మొత్తంగా 1144 షెడ్ల నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే 863 షెడ్ల నిర్మాణం పూర్తికాగ మిగిలినవి తుది దశలో ఉన్నవి. జనవరి మాసాంతం నాటికి వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయనున్నారు. మినీ గోకులం నిర్మాణం అంశంలో రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానంలో ఉంది.

### ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం

అలాగే జిల్లాలో రూ.12 కోట్ల అంచనాతో 4వేల ఫారం పాండ్లు మంజూరు కాగా 1330 పనులు చేపట్టి ఇప్పటికే 203 పనులను పూర్తి చేశారు. మిగిలినవి పురోగతిలో ఉన్నవి. సన్న చిన్న కారు రైతుల సుస్థిర అభివృద్ధి కోసం రూ.41.25 కోట్ల అంచనాతో 3630 ఎకరాలలో 100శాతం రాయితీతో మామిడి, సపోటా, చీని, నిమ్మ తదితర పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. పల్లె పండుగ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఉపాధి హామీ నిధులతో మొదటి విడతలో రూ.63 కోట్లతో గ్రామాలలో సిమెంట్ రహదారులు, బీటి రహదారులు, డబ్ల్యూబిఎం రహదారులు, ప్రహరీ గోడల నిర్మాణం తదితరాలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 841 పనులలో 618 పనులు పూర్తి చేయడం జరిగింది. రెండో విడతలో 25 కోట్ల రూపాయలతో చేపట్టిన 408 పనులు వివిధ దశలో పురోగతిలో ఉన్నవి. వీటన్నిటిని ప్రాధాన్యత పరంగా నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంది.

### పశువుల భద్రతకు భరోసా ఏర్పడింది



సన్న కారు రైతులమైన మేము పశువులపై ఆధారపడి జీవిస్తున్నాం. మాకు 6 పశువులు ఉన్నవి. ఇంతకుముందు అవి వానకు తడుస్తూ ఉండడం వల్ల వాటి ఆరోగ్యం పై దిగులుగా ఉండేది. గత ప్రభుత్వంలో పశువుల షెడ్లకు నిధులు మంజూరు కాలేదు. ఈ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామీణ ప్రాంతంలో మాలాంటి పేద రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా అండగా నిలుస్తోంది. రూ.2.30 లక్షలతో మాకు పశువుల షెడ్డు మంజూరు అయింది. ఇందులో మేము కేవలం 10 శాతం రూ.23,000 మాత్రమే చెల్లించాం. ఆలస్యం చేయకుండా మొత్తం బిల్లును ప్రభుత్వం చెల్లించింది. షెడ్డు నిర్మాణాన్ని మేము పూర్తి చేసుకున్నాం. ఎండ వానల్లో కాకుండా షెడ్లలో ఉంచి పెంచడం ద్వారా మరింత పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుంది. పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

**: గుర్రాల రాధమ్మ, మహిళా పాడి రైతు,**
**అంగళ్లు గ్రామం, కురబలకోట మండలం**

### గ్రామీణ ప్రాంతాలలో మన్నికైన ఆస్తులు సృష్టి



జిల్లాలో గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులు అన్నీ కూడా ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేయడం జరుగుతున్నది. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో డ్వామా శాఖ ద్వారా మొత్తంగా 18,191 పనులు చేపట్టగా, 4579 పనులు పూర్తి చేయడం జరిగింది. 13,612 పనులు ప్రగతిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో పనుల కల్పన ద్వారా ఇప్పటి వరకు వేతనాల రూపంలో రూ.193 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.52 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం ద్వారా మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధిలోకి వచ్చే విధంగా పనులు కల్పించడానికి కృషి చేస్తున్నాం. తద్వారా గ్రామాలకు అవసరమైన ఆస్తులను కల్పించి నికర ఆదాయ మార్గాల పెంపుదలకు, ప్రతి కుటుంబానికి వందశాతం మేలు చేకూరడడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

**: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

### పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



రాష్ట్రంలో పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ప్రభుత్వం గోకులం బిల్లులను నిలిపివేసి రైతులను ఇబ్బంది పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా నిధులను మంజూరు చేస్తోంది. రైతులు తమకు నచ్చిన రీతిలో వారి స్థల అనుకూలతను బట్టి కేవలం 10 శాతం వ్యయంతో గోకులం షెడ్లు నిర్మించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. తద్వారా ఈ పథకానికి రైతుల నుంచి విపరీతమైన ఆదరణ లభిస్తోంది. చిన్న సన్న కారు రైతులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం దారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలి. నియోజకవర్గంలో దాదాపు 300 షెడ్లు మంజూరయ్యాయి. వాటన్నిటిని త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలలో ప్రగతి కళ కనిపిస్తోంది.

**:రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**